బాలసుబ్రహ్మణ్యంను స్ఫూర్తిగా తీసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుని అవార్డు గ్రహీత డాక్టర్ వేంకట సూర్య బాలసుబ్రమణ్యంను అధ్యాపకులు ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని మరింత మెరుగైన విద్యాబోధన చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుని అవార్డు గ్రహీత డాక్టర్ వేంకట సూర్య బాలసుబ్రహ్మణ్యం అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బాలసుబ్రహ్మణ్యం సేవలను కొనియాడారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపు ఈ పురస్కారం అని అన్నారు. పురస్కార గ్రహీత డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులకు మరింత చేరువై ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతానని అన్నారు.

అన్నివర్గాలను నిరుత్సాహపరిచిన బడ్జెట్

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరుత్సాహపరిచిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరకొర నిధులు, అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించిందన్నారు. రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా.. ఏ రంగానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయిందన్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువతకు ఈ బడ్జెట్‌తో ఒరిగేదేమీ లేదన్నారు. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, రైతు సంక్షేమానికి ఎక్కడా సరిపడా కేటాయింపులు లేవని, సూపర్ సిక్స్ పథకాల ఊసే కానరాలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఆడంబరాలపై ఉన్న శ్రద్ధ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై లేదని మరోసారి రుజువైందన్నారు. బడ్జెట్ లో విజయవాడ నగరానికి మొండిచేయి చూపారని ఆరోపించారు. గుణదల ఫ్లైఓవర్, బుడమేరు ఆధునికీకరణ, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టవలసిన రహదారులు, డ్రెయిన్లు, ఇతర మరమ్మతులకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. పైగా నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదని, ఖర్చులు, జమ అయిపోయిన తరుణంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో మే 30న వైసీపీ ప్రభుత్వం ఏర్పడితే, కేవలం నెలన్నర రోజుల్లోనే జూలై 12న బడ్జెట్ ప్రవేశపెట్టామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సర్వం శివమయం

- కార్తీక ఏకాదశి విశేషపూజలు
- సహస్ర లింగార్చన, బిల్వార్చనలు



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకారం



ప్రత్యేక బిల్వార్చనలో ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సర్వం శివమయంగా మారింది. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, సహస్ర లింగార్చనలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం వరకు స్వామివారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపారాధనలు చేశారు. మధ్యాహ్నం మల్లేశ్వరస్వామికి ప్రత్యేక బిల్వార్చనను ఆలయ అర్చకులు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు బిల్వార్చన జరిగింది. సాయంత్రం సహస్ర లింగార్చనకు పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు దీపార్చన సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షించగా, ఈవో కె.ఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయం, రాజగోపురం ఎదుట భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

నేత్రపర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



సంప్రదాయ నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: అరుణోదయ కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్వాగతనృత్యం, జతిస్వరం, గణేషవందనం, ఆయగిరి నందిని, జయము జయము, లలితా కళావాహిని అష్టలక్ష్మి స్తోత్రం అంశాలను ప్రదర్శించారు. నృత్యకార్యక్రమంలో చక్రిక, పేర్ని జస్మిత, నివేది, తన్విత తేజశ్రీతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా తెలుగు అధ్యాపకురాలు కరణం రమాదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో అరుణోదయ కళాసమితి కార్యదర్శి మాధురి, కోశాధికారి పార్వతి, శమీష సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి బాబా మందిరంలో దీపోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం ఏకాదశి సందర్భంగా మారుతీ వ్యాయామశాల సమీపంలోని గణపతి బాబా మందిరంలో మంగళవారం దీపోత్సవం జరిగింది. ఆలయ అర్చకుడు బాబా వారు గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు దీపోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా కార్తిక మాసంలో దీపోత్సవం ప్రాముఖ్యతను ఆలయ అర్చకులు వివరించారు.

15 నుంచి యల్లాజోస్యుల నృత్యోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీ కనక దుర్గా నృత్యమందిర్ ఆధ్వర్యంలో 15 వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు యల్లాజోస్యుల రామకృష్ణ కూచిపూడి నృత్యోత్సవాలను సంగీత కళాశాలలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యల్లాజోస్యుల అనూరాధ, నేతి విద్యాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 వ తేదీ వినాయక చవితి, 16న అన్నమయ్య తత్వం, 17న స్వామియే శరణమయ్యప్ప నృత్యరూపకాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

రామలింగేశ్వరునికి విశేష అర్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు.

గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 14వ తేదీ నుంచి జరగనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్ పోస్టర్‌ను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఠాగూర్ స్మారక గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీని కలిసిన నందిగామ ఏసీపీ

విజయవాడస్పోర్ట్స్: నందిగామ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా తిలక్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ నుంచి ఆయన ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

విలేజి కండ్రికలో తాగునీటి పరీక్షలు


పాయకాపురం(విజయవాడ రూరల్): వీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు రంగు మారి వస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విలేజి కండ్రికలో తాగునీటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, ప్రజల సమక్షంలో నీటి సరఫరా విభాగం ఏఈ మాధవ్ తాగునీటి పరీక్షలు నిర్వహించారు. ఈ నీటిలో ఎలాంటి తేడాలు లేవని క్లోరినేషన్ చేసిన తర్వాత తాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ అనంతలక్ష్మీదేవి సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం డి.మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సేవా సంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

17న శారదా సదనం, ధార్మిక భవనం ప్రారంభం

- ప్రారంభించనున్న విధుశేఖర భారతి
- నగరంలో నాలుగు రోజులపాటు బస
- ప్రతిరోజూ అనుగ్రహ భాషణ



విధుశేఖర భారతి పర్యటన వివరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: శివరామ కృష్ణ క్షేత్రంలో పునర్ నిర్మితమైన నూతన భవన సముదాయం శారదా సదనం, ధార్మిక భవన సముదాయాన్ని ఈనెల 17 వ తేదీ ఆదివారం సాయంత్రం శృంగేరీ శారదా పీఠం(కర్నాటక) ఉత్తరాధికారి విధుశేఖర భారతి ప్రారంభిస్తారని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శివరామకృష్ణ క్షేత్రంలో 17 వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు స్వామి విజయయాత్ర చేస్తారని, ఈ సందర్భంగా ధార్మిక భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. రోజూ భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారని తెలిపారు. 18 వ తేదీ సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రం, మారుతీ వ్యాయామశాలను దర్శిస్తారని, యనమలకుదురులోని శివాలయంలో జరిగే కుంభాభిషేకంలో పాల్గొంటారని, రాత్రి 7 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామిజీని కలుస్తారన్నారు. 19 వ తేదీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, 20 వ తేదీ ఉదయం శివరామకృష్ణ క్షేత్రం దేవాలయ సముదాయంలో కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు. పూజల అనంతరం స్వామి నరసరావుపేట వెళతారని వివరించారు. సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు గండూరి చంద్రమౌళి, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గండూరి రమా సత్యనారాయణ పాల్గొన్నారు. బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

రేపు ప్రభుత్వ నిరంకుశ పాలనపై కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు, నిత్యావసర ధరలను పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపిందని, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14న కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాపోరు కార్యక్రమం 58వ డివిజన్‌లో మంగళవారం జరిగింది. సీపీఎం నాయకులు భూపతి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తామన్న సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా, ప్రజలపై అధిక భారాలను మోపి వారి నడ్డి విరుస్తోందన్నారు. సింగ్‌నగర్ ప్రజలు ఇప్పటికే వరదల్లో సర్వం నష్టపోయారని, వీటికి తోడుగా ప్రభుత్వం ఇప్పుడు కరెంటు చార్జీల పేరుతో ప్రజలపై వేలకోట్లు భారం వేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకపక్క నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటుకున్నాయని, మరోపక్క ఉచిత ఇసుక అని చెప్పి ట్రాక్టర్‌కు 5వేల నుంచి 6వేల రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై నవంబర్ 8 నుంచి 13 వరకూ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేస్తున్నామని, 14వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపట్టనున్నామని చెప్పారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం 58వ డివిజన్ నాయకులు ఎస్కే నిజాముద్దీన్, వి.సాంబశివరావు, ఎంవీ రమణ, సుగుణ, ఆదామి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల నేత టీవీ

ఘనంగా టీవీ 108వ జయంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీధి బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ కోసం నగర ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు(టీవీ) అలుపెరగని కృషి చేశారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్ అన్నారు. టీవీ బాలల హక్కుల నేత అని కొనియాడారు. హనుమాన్‌పేటలోని టీవీ భవన్‌లో మంగళవారం నగర ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు 108వ జయంతి ఘనంగా నిర్వహించారు. టీవీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు టీవీ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. టీవీ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయన తనయులు రమేష్, సురేష్ తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తూ ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. నగరంలో వివిధ ఆశ్రమాలలో ఆశ్రయం పొందుతున్న బాలబాలికలు, వృద్ధులకు క్రమం తప్పకుండా భోజనం, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఆర్.బిచ్చయ్య, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కె.ప్రకాష్ కుమార్, నవజీవన్ బాల భవన్ కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమారి, మస్తాన్, కృపా ఫౌండేషన్ అధినేత రవీంద్ర, నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగి మోహన్ కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది, బాలలు పాల్గొన్నారు.

నేరస్తుడి కోసం గాలింపు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నేరస్తుడి ఆచూకీ కోసం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు జిల్లా వ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లాలోని చందర్లపాడు గ్రామానికి చెందిన కొల్లి అమర్‌నాథ్(45)పై విజయవాడ ఆరవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నమోదై ఉంది. అమర్నాథ్ కొంతకాలంగా వాయిదాలకు హాజరుకావడం లేదు. దీంతో కోర్టు అతన్ని నెల రోజుల్లోపు న్యాయస్థానంలో గాని, విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో గాని లొంగిపోవాలని ఆదేశించింది. నేరస్తుడైన అమర్‌నాథ్ ఆచూకీ తెలిసిన వారు అజిత్ సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ ఫోన్ 94406-27037, 83410-51000 నంబర్లకు తెలియజేయాలని సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు.

పరంజా తొలగించారు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. మధురానగర్ ఆర్‌యూబీలో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న పరంజాలను తొలగించారు. మధురానగర్ ఆర్‌యూబీలో పెయింటింగ్ పనుల కోసం పరంజా ఏర్పాటు చేసి పనులు పూర్తి చేశారు. అయితే పరంజామాను మాత్రం తొలగించలేదు. దీంతో స్థానికులు రాకపోకలకు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన పరంజాలను తొలగించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నత్తనడకన మురుగు కాలువ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్ రోడ్డు, వీవీ నరసరాజు రోడ్డులలో మురుగుకాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మురుగుకాలువ పనుల్లో భాగంగా రోడ్డును క్లోజ్ చేయటంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పనులు వేగవంతం చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు. మురుగుకాలువ వరకు వచ్చిన తరువాత రోడ్డు కనెక్టివిటీ లేకపోవటంతో తిరిగి వెనక్కి వెళ్లి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు.

దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ లైసెన్స్ రద్దు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కేంద్రంగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ వ్యాపార లైసెన్స్‌ను రద్దు చేస్తున్నట్లుగా ఆర్‌బీఐ ఒక ప్రకటనలో ప్రకటించింది. నవంబర్ 12న వ్యాపారం ముగిసే సమయానికి బ్యాంక్ వ్యాపారాన్ని నిలిపివేస్తుందంటూ అందులో పేర్కొంది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఏపీ సహకార కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీకి సూచించింది. బ్యాంక్‌లో ఐదు లక్షల మేర డిపాజిట్ చేసిన వారికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ నుంచి పొందడానికి అర్హులని పేర్కొంది. డిపాజిట్ దార్లలో సుమారు 95.8 శాతం తిరిగి పొందటానికి అర్హులుగా ఉన్నారని తెలిపింది.